## కాశీపూర్‌లో అక్రమ నిర్మాణాల తొలగింపు



కాశీపూర్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

**కంది, ఆగస్టు 12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాశీపూర్‌లో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 108లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మంగళవారం తహసీల్దార్ రవికుమార్ పర్యవేక్షణలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, పంచాయతీ కార్యదర్శులు అక్రమ నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని అక్రమార్కులకు తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

### సిపి డాక్టర్ అనురాధ

**చిన్నకోడూరు, ఆగస్టు 12,ప్రభాతవార్త :** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని సీపీ డాక్టర్ అనురాధ హెచ్చరించారు. చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం సీపీ డాక్టర్ అనురాధ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను, సీజ్ చేసిన వాహనాలను, రిసెప్షన్ రికార్డు, రైటర్ రూమ్ పరిశీలించారు. రికార్డ్స్ తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నమోదవుతున్న కేసుల విషయంలో పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు సిద్దం చేసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, జూదంపై నిఘా పెట్టాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై గ్రామాలలోని ప్రజలకు, యువకులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్‌ఐ సైఫ్ అలీ, ఎస్‌బి సిఐ కిరణ్, ఎస్‌బి ఎస్ఐ చంద్రమోహన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

## యూరియా కోసం కదం తొక్కిన బిఆర్ఎస్ శ్రేణులు

### తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల ఎదుట ఆందోళనలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ శ్రేణులు మంగళవారం కదం తొక్కారు. నియోజకవర్గంలోని నంగునూర్, నారాయణరావుపేట మండలాల బిఆర్ఎస్ శ్రేణులు ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద యూరియా కొరత తీర్చాలని ఆందోళన చేపట్టి వినతిపత్రాలు అందజేశారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండల బిఆర్ఎస్ శ్రేణులు జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు సకాలంలో యూరియా అందించడంలో విఫలమైందన్నారు. బిఆర్ఎస్ హయాంలో రైతులకు సకాలంలో యూరియా అందించడంతో పాటు రైతు బంధు అందించిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. గత పదేళ్ల కాలంలో ఏనాడు రైతులు యూరియా కోసం చెప్పులు క్యూలైన్‌లో పెట్టలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాతే యూరియా కొరత మొదలైందన్నారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలి అన్నారు. లేదంటే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా కార్యక్రమాలలో మాజీ ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ చైర్మన్లు, బిఆర్ఎస్ శ్రేణులు యాదగిరి, చింతల శ్రీనివాస్, లింగంగౌడ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్, సోమిరెడ్డి, సారయ్య, కిష్టారెడ్డి, బాలమల్లు, సంతోష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల ముందస్తు అరెస్ట్

**పాపన్నపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



పోలీసుల అదుపులో బిజెపి నాయకులు

పెద్దమ్మగుడి కుంకుమార్చనకు వెళ్లనీయకుండా ముందస్తుగా అరెస్టు చేయడం శోచనీయమని జిల్లా బజరంగదళ్ విద్యార్థి ప్రముఖ్ బోల కృష్ణ, విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు బద్దపురం సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం పాపన్నపేటలో వారు మాట్లాడుతూ హైదరాబాదులోని పెద్దమ్మ గుడి కూల్చిన సందర్భంగా మంగళవారం హిందూ సంఘాల పిలుపుమేరకు పెద్దమ్మగుడి వద్ద కుంకుమార్చన కార్యక్రమం నిర్వహణకు రాష్ట్రశాఖ పిలుపు నిచ్చింది. కుంకుమార్చనకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లే ప్రయత్నంలో పోలీసులు అడ్డుకొని ముం దస్తుగా అరెస్టుచేసి సొంత పూచికత్తుపై వదిలివే శారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెద్దమ్మ గుడిని పునర్నిర్మాణం చేపట్టాలని వారి డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు కర్రేల వెంకటేశం.. నాయకులు మల్లేశం, నర్సింలు. శివ కుమార్. అనిల్‌కుమార్. గోపాల్ .తదితరులు ఉన్నారు.

**పెద్దశంకరంపేటలో...**

**పెద్దశంకరంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త :**



పెద్దశంకరంపేటలో పోలీసుల అదుపులో బిజెపి నాయకులు

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వద్ద పెద్దమ్మ గుడి కూల్చివేతను నిరసిస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం వద్ద కుంకుమార్చన కార్యక్రమానికి పిలుపు ఇవ్వడంతో మంగళవారం పెద్దశంకరంపేట నుండి బిజెపి నాయకులు తరలి వెళ్తుండడంతో ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్ తరలి వెళ్తున్న మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్.. బిజెపి మండల మాజీ అధ్యక్షుడు కోణం విట్టల్.. మండల బిజెపి నాయకులు సుధాకర్. అనిల్. కృష్ణ తదితర బిజెపి నాయకులు పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు..

**చిన్నశంకరంపేటలో...**

**చిన్నశంకరంపేట, ఆగస్టు 12,ప్రభాతవార్త:**
ఇటీవల గుర్తుతెలియని దుండగులు భాగ్యనగరం లోని జూబ్లిహిల్స్‌లో ఉన్న పెద్దమ్మగుడిని ధ్వంసం చేశారు. బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో పెద్దమ్మ గుడిలో కుంకుమార్చన చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా బిజెపి నాయకులను పోలీసులు ముం దస్తుగా అరెస్టు చేసి చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు తమను అరెస్టుచేయడం తగదని బిజెపి నాయకులు అన్నారు. బాగగౌని సురేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, మూర్తి శంకర్, శివ శంకర్, నీళ్ల శ్యామ్‌లు ఉన్నారు.




చిన్నశంకరంపేటలో బిజెపి నేతలను అరెస్టు చేసిన పోలీసులు

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి జిల్లాలో ఆకస్మిక పర్యటన, తనిఖీలు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
జిల్లా కలెక్టర్ హైమావతి మంగళవారం విస్తృతంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించడంతో పాటు గురుకుల పాఠశాలను పరిశీలించారు. జిల్లాకేంద్రంలోని నాసర్‌పురలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. హాజరు పట్టికను, మందులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సిద్దిపేట నుంచి చిన్నకోడూరు వెళ్లే దారిలో అసంపూర్తిగా మిగిలిపోయిన బ్రిడ్జి పనులలో వేగం పెంచాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. 1వ వార్డులోని లింగారెడ్డిపల్లి తుమ్మల కుంట చెరువు నిండి మత్తడి దూకి రోడ్లపైకి నీరురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దవాఖానను ఆమె సందర్శించారు. సిద్దిపేట అర్బన్ మండల ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులోగల తెలంగాణ సాధారణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలోని వసతిగృహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెత్త చెదారం ఎక్కడపడితే అక్కడే ఉండడంతో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యకం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియపై ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లతో జూమ్‌సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ ప్రక్రియ వేగం పెంచాలని తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో రమేష్, డిఆర్‌డిఎ పిడి జయదేవ్‌ఆర్య పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో చెత్త, చెదారాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్



టిఎల్‌ఎం మేళాలో ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

## బోధనోపకరణాలతో బోధన సులభతరం

### డిఇవో రాధాకిషన్

**పెద్దశంకరంపేట, ఆగస్టు 12 ప్రభాతవార్త :** బోధనోపకరణాలతో బోధన సులభతరం అవు తుందని మెదక్ జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన బోధనాభ్యాసన సామాగ్రి మేళను ప్రారంభించి ఉపాధ్యాయులు తయారుచేసిన ఎగ్జిబిట్లను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అభ్యాసనా స్థాయిని మెరుగుపరచడానికి టిఎల్‌ఎంమేళ దోహద పడుతుందన్నారు. తరగతి గదిలో ప్రతి ఉపాధ్యా యుడు బోధనఉపకరణాలతో బోధించాలని సూచిం చారు. బోధన అభ్యసనా సామాగ్రి ద్వారా విద్యార్థికి త్వరగా అర్థమవుతుందన్నారు. ఇక్కడ ప్రదర్శించిన ఎగ్జిబిట్లలో ఒక్కో సబ్జెక్టు నుంచి రెండు ఉపకారణాలను జిల్లాస్థాయి ప్రదర్శనకు పంపనున్నట్లు వెల్లడించారు. తెలుగు, ఇంగ్లీష్. గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు తయారు చేసిన ఎగ్జిబిట్లను ఈ మేళాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశం ప్రధానోపాధ్యా యులు విటల్, అశోక్‌రెడ్డి, సత్యకుమార్, మారుతి, రాములు, వివిధ ఉపా ధ్యాయ సంఘాల బాధ్యులు బి.శ్రీనివాస్ ఎన్.శ్రీనివాస్, ప్రసన్నకుమార్, సుధీర్, రవి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గుణాత్మక విద్య కోసమే బోధన అభ్యాస సామాగ్రి మేళా

**వెల్దుర్తి, ఆగస్టు 12, ప్రభాతవార్త:** విద్యార్థుల గుణాత్మక విద్య కోసమే బోధన అభ్యాస సామాగ్రి మేళాను ఎంఈఓ సీతారామ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మేళా ప్రదర్శన ప్రధాన లక్ష్యాలు ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధనకు అవసరమైన సామాగ్రిని వినియోగిస్తూ బోధనభ్యాస సామాగ్రిని నిత్యం తయారు చేసుకునేలా సూచనలు చేయడం జరిగింది. అమృత భవాలపై అవగాహనకు అవసరమైన సామాగ్రిని తయారు చేసుకోవాలని విద్యార్థులకు స్వీయ అభ్యాసనకు అవకాశం పెంచడం తరగతి సామర్థ్యాలను అనుగుణంగా సామాగ్రిని ప్రదర్శించడంతో తరగతి గదిని తయారుచేయొచ్చు అన్నారు. ఈకార్యక్రమం మనం ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాల నుండి టీ ఎల్ ఎం తయారు చేసుకొని వచ్చి పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఎంఈఓ యాదగిరి. వెల్దుర్తి కాంప్లెక్స్ ఉపాధ్యాయులు సాంబయ్య పాల్గొన్నారు.



నారింజ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

## నిండుకుండలా నారింజ ప్రాజెక్టు

### -పరిశీలించిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులోని నారింజ ప్రాజెక్టు నిండు కుండలా మారిపోయింది. మంగళవారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని, ప్రాజెక్టు కెపాసిటీని, ప్రాజెక్టు నుంచి నీరు విడుదల తదితర అంశాలను సంబంధిత అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, వాహనాల చోదకులు, ప్రాజెక్టును వీక్షించేందుకు వచ్చే పర్యాటకలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు యాకూబ్, మోహియుద్దీన్, మాజీ కౌన్సిలర్ అబ్దుల్లా,యువ నాయకులు ముర్తుజా, దీపక్ ఉన్నారు.

## 5 నెలలుగా అందని కమీషన్

### ఇబ్బందుల్లో రేషన్ డీలర్లు

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** జిల్లాలో రేషన్ డీలర్లకు 5 నెలల నుంచి రావాల్సిన కమీషన్ విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్, మేలో మూడు నెలల పాటు ఒకేసారి బియ్యం పంపిణీ చేయడం వల్ల 5 నెలల నుంచి కమీషన్ విడుదల కాలే దని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి కమీషన్‌ను ముందుగా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన త్వరాత కేంద్ర ప్రభుత్వానికి బిల్లులు పెట్టుకుంటుంది. 5నెలల నుంచి ఈ విధానం లో మార్పులు చేసి రాష్ట్ర ప్రభుత్వం కమీషన్ వేరుగా ఇవ్వడం వల్ల డీలర్లు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్‌లో ప్రభుత్వం వర్షాకాలం దృష్ట్యా మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో బియ్యాన్ని భద్రపరిచుకునేందుకు అదనపు గదులను అద్దెకు తీసుకున్నామని వాపోతున్నారు. గత 5 నెలల నుంచి కమీషన్ ఇవ్వకపోవడంతో కోట్లల్లో బకాయి ఉందని డీలర్లు అంటున్నారు. గతంలో లాగానే ఒకేసారి కమీషన్ చెల్లించాలని...వేర్వేరుగా ఇవ్వడం మూలంగా ఇబ్బందులు పడాల్సివస్తుందని డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఒకే కమీషన్ డీలర్లకు వర్తింపజేసి ప్రతి నెల 1న కమీషన్ చెల్లించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రేషన్ దుకాణాల డీలర్ల సంఘం వైస్ ప్రెసిడెంట్ వంగరి నాగరాజు కోరారు.

# పిహెచ్‌సిలో బయోమెట్రిక్‌ను ఏర్పాటు చేయాలి

**ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ.. విధులకు హాజరు కాని డాక్టర్లపై కలెక్టర్ అసహనం..**

**సదాశివపేట, ఆగస్టు 12(ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవల నాణ్యత, రోగులకు అందిస్తున్న సౌకర్యాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఉదయం ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కలెక్టర్ ఆసుపత్రిలోకి ప్రవేశించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. తనిఖీ సమయంలో ఉద్యోగుల హాజరు నమోదు రిజిస్టర్ పరిశీలించి, విధులకు హాజరు కాని డాక్టర్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో సమయానికి హాజరయ్యేలా సూచనలు చేశారు. వైద్య సిబ్బంది సమయానికి హాజరయ్యేలా బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. మెడిసిన్ రిజిస్టర్ను పరిశీలించిన కలెక్టర్, రోగులకు ఇవ్వాల్సిన మందుల చీటీని డాక్టర్లు పద్ధతి ప్రకారం కాకుండా తెల్లకాగితంపై రాసి ఇస్తున్నారని గుర్తించారు. అలా రాయడం పారదర్శకత కాదని స్టాండర్డ్ ప్రిస్క్రిప్షన్ ప్యాడ్‌లను ఉపయోగించాలని వైద్యులకు సూచించారు. మందుల సరఫరా, స్టాక్ వివరాలు స్పష్టంగా నమోదు చేసి ఉండాలని ఆదేశించారు. అవసరమైన మందులు నిల్వలో ఉన్నాయా, రోగులకు అందించే ఔషధాలసరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రిలో పేషెంట్లకు అందిస్తున్న భోజనం మెనూ, వంట నాణ్యత, పరిశుభ్రతను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆహారం రుచి, నాణ్యతను పరిశీలించి, భోజనం సమయానికి అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పేషెంట్లతో కలెక్టర్ మాట్లాడి, వారికి అందుతున్న వైద్యసేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. మందులు సమయానికి అందుతున్నాయా? డాక్టర్లు, నర్సులు సరైన సమయానికి అందుబాటులో ఉన్నారా? శుభ్రత, ఆహారంవంటి అంశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నాయి? అని ప్రశ్నించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతలో ఎలాంటి లోపాలుఉన్నా వెంటనే సరిచేయాలని, నిరంతర శుభ్రతపాటించాలని సూచించారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకు ప్రతి వైద్య సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ప్రభుత్వ ఆసుపత్రులపై ఆధారపడుతున్నందున,వారికీ అందిస్తున్న వైద్యసేవల నాణ్యత ప్రమాణాలు తగ్గకుండా చూడాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, మండల పరిషత్ అధికారి లక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ఉమ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## విద్యారంగ సమస్యల పరిష్కారమే ఎఐఎస్ఎఫ్ ధ్యేయం

### జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 12,ప్రభాతవార్త :** విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్ఎఫ్ ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో మంగళవారం ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాలే ఊపిరిగా.. విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం విద్యార్థుల పక్షాన నిలబడుతున్న ఏకైక సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాత్రమేనని తెలిపారు.బ్రిటిష్ మూకలను దేశం నుంచి తరమడంలో ముందు వరసలో పోరాడిన విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న ఆవిర్భావించిన నాటి నుంచి నేటి వరకు చదువు, పోరాడు నినాదంతో ఉద్యమిస్తున్న సంఘం అన్నారు. విద్య అంగడి సరుకు కాకుండా సమాన విద్య శాస్త్రీయ విద్య అందేవిధంగా పాలక పక్షాలు నిర్ణయాలు చేసే వరకు విద్యార్థిసంఘం ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు వేల్పుల ప్రసన్నకుమార్, మిట్టపల్లి సుధాకర్, బాణోత్ నవీన్, భరత్, శ్రవణ్, శ్రీను, సృజన్, రమేష్, శ్రీను అరవింద్, కిట్టు పాల్గొన్నారు.

### బకాయి వేతనాలు చెల్లించాలంటూ

## మండల పరిషత్ ఎదుట కార్మికుల ధర్నా

**మనూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులకు అందించాల్సిన బకాయి బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మనూర్‌లోని మండల పరిషత్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీల కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సేవలు అందచేస్తున్న పంచాయితీ కార్మికులకు రెండు నుంచి నాలుగు నెలల వేతనాలు బకాయిపడి ఉందని, వేతనాలు నెలనెల అందకుంటే కార్మికులు తమ కుటుంబ సభ్యులను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. కార్మికులకు ప్రతి నెల సబ్బులు, సరుపు,బెల్లం లాంటి కాస్మోటిలు ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే నెలకు 18 వేల రూపాయలకు వేతనం పెంచుతామని చేసిన హామీని అమలు చేయాలన్నారు. కార్మికులు పదవీవిరమణ పొందితే రిటైర్మెంట్ ప్రయోజనాలు అందించాలన్నారు. విధినిర్వాహణలో మృతి చెందితే అంతిరమ సంస్కారాలకు లక్ష రూపాయలను, 10లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను అందించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, స్పందించకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అంజయ్య, బాలప్ప, ఉపాధ్యక్షులు నర్సింలు, సహాయ కార్యదర్శి సయ్యద్, కోశాధికారి దయాన స్వామి, సంజీవులు, తుకారం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



విలేకరులకు వివరాలను అందిస్తున్న ఎసిపి రవీందర్‌రెడ్డి

## అంతర్ జిల్లా దొంగ అరెస్టు

### 10.5 తులాల బంగారం..సెల్‌ఫోన్ స్వాధీనం

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 12, ప్రభాతవార్త :** అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి 10.5 తులాల బంగారు అభరణాలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని త్రీ టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం సీఐ విద్యాసాగర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.జగదేవాపూర్ మండలం రాయవరం గ్రామానికి చెందిన దబ్బేట బాల్‌లింగం అలియాస్ లింగం, బాబు,ప్రవీణ్(30) కొన్నేళ్ల నుంచి రాత్రి పగలు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కరీంనగర్, హైదారాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలతోపాటు ఇతర జిల్లాలో దొంగతనాలకు పాల్పడి పలు మార్లు జైలుశిక్ష అనుభవించారని తెలిపారు. రంగధాంపల్లి విఘ్నేశ్వర నగర్‌కు చెందిన తిరుగుళ్ల కృష్ణమూర్తిశర్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గత మేలో ఇంటి తాళం పగులగొట్టి కప్ బోర్డులో దాచి ఉంచిన 5 తులాల బంగారు పెద్ద హారం, 2 తులాల బంగారు నెక్లెస్, 2 తులాల బంగారు మువ్వల హారం, తులంన్నర నల్లపూసల దండ దొంగిలించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కేసు నమోదు చేసి ఫిర్యాదు ప్రారంభించారని తెలిపారు. ఇంటి సమీపంలోగల సిసి కెమెరాలను ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడి కదలికలపై నిఘా వేసినట్లు వివరించారు. దబ్బేట బాల్‌రాజు మంగళవారం సిద్దిపేటకు వస్తున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని బి.జె.ఆర్. చౌరస్తా వద్ద బంగారం అమ్మడానికి వచ్చి నిలబడగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారని పేర్కొన్నారు. బాల్‌రాజు నుంచి 10.5 తులాల బంగారం,సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్‌జిల్లా దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ విద్యాసాగర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాస్, బాబు, రాజు, స్వామి, శ్రీకాంత్, రమేష్‌లను అభినందించారు. త్వరలో సీపీ చేతుల మీదుగా రివార్డు అందజేస్తామని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ తమ ఇంటి ఎదుట సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎసిపి సూచించారు.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**చిన్నశంకరంపేట, ఆగస్టు 12,ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులతో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధి గవ్వలపల్లి తండాలో మంగళవారం జరిగింది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం... గవ్వలపల్లి తండాకు చెందిన భానోత్ సుభాష్(30) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్ని రోజులుగా కూలిపనులు దొరకకపోవడంతో పాటు, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అని తనలో తానే బాధపడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఆగస్టు 2వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో భాగ్యనగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సుభాష్ మృతి చెందాడు. మృతుడి తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బిజెపి నేతల హౌస్ అరెస్టు



బిజెపి నేతలను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

**రామచంద్రాపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో కొలువునన శ్రీపెద్దమ్మతల్లి ఆలయాన్ని కాంగ్రెస్‌ప్రభుత్వం మారుస్తున్న సందర్భంగా బిజెపినాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టుచేశారు. బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిలను రామచంద్రాపురంలోని వారినివాసంలో అరెస్టుచేశారు.

## క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్సీ



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**జహీరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పరిధిలోని పస్తాపూర్ చౌరస్తా ఫ్లైఓవర్ పైన మంగళవారం ఆగి ఉన్న లారీని బైక్ రైడర్ ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలకు గురైన క్షతగాత్రులను అటుగా వస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి తన కారును ఆపేసి అంబులెన్స్‌కు ఫోన్ చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీతో పాటు భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, బిజెపి నాయకులు గొల్ల భాస్కర్‌లు ఉన్నారు.

## అల్లాదుర్గంలో బిజెపి నాయకుల అరెస్టు




బిజెపి నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**అల్లాదుర్గం, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో భక్తులచే నిత్యపూజలందుకుంటున్న శ్రీపెద్దమ్మతల్లి ఆలయం కూల్చివేతకు నిరసనగా గాంధీభవన్‌కు వెళుతున్న మండల బిజెపి నాయకులను మంగళవారం ఉదయం అల్లాదుర్గం పోలీసులు అరెస్టుచేసి పోలీసుతాణాకు తరలించారు. మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కాల రాములు, కోశాధికారి రమేష్, యువమోర్చా అధ్యక్షులు వడ్ల బాలరాజ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కృష్ణలను పోలీసులు అరెస్టుచేసి ఠాణాకు తరలించారు.

## జెఎన్టీయు హ్యాసీస్‌లో లైబ్రరీ దినోత్సవం



జెఎన్టీయు హ్యాసీస్‌లో లైబ్రరీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం

**చౌటకూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ సుల్తాన్‌పూర్ (జెఎన్టీయు హ్యాసీస్)లో మంగళవారం లైబ్రరీ దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. పుస్తకాల తండ్రిగా పేరుగాంచిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్ జయంతిని పురస్కరించుకుని లైబ్రరీ దినోత్సవం సెంట్రల్ లైబ్రరీలో జరుపుకున్నారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.నర్సింహ ప్రారంభించారు. లైబ్రరీలు జ్ఞానానికి ద్వారాలు అని, విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ-రిసోర్సులు, ఆన్‌లైన్ జర్నల్స్, డిజిటల్ లైబ్రరీ వినియోగంపై, లైబ్రరీ ఓరియంటేషన్ సెషన్లు నిర్వహించారు. లైబ్రరీలు జ్ఞానానికి ద్వారాలు అనే అంశంపై పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీ నిర్వహించారు.

## హిందూసంఘాల కార్యకర్తల అరెస్టు



బజరంగ్‌దళ్, విహెచ్‌పి కార్యకర్తలను అరెస్టు చేసిన దృశ్యం

**పుల్‌కల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన హిందూ సంఘాలు (భజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్) బాధ్యులను మంగళవారం పోలీసులు అరెస్టుచేసి పోలీసుతాణాకు తరలించారు. హైద్రాబాద్‌లోని బంజారాహిల్స్‌లోగల పాత పెద్దమ్మతల్లి ఆలయాన్ని ప్రభుత్వం కూల్చివేయడాన్ని నిరసిస్తూ హిందూసంఘాల నాయకులు బంజారాహిల్స్ కార్యక్రమానికి పిలుపునివ్వడంతో కార్యకర్తలు హైద్రాబాద్ తరలివెళుతుండగా పోలీసులు అరెస్టుచేసి పోలీసుతాణాకు తరలించారు. మండల కేంద్రమైన చౌటకూరుకు చెందిన భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ పల్లె ప్రభుకుమార్ గౌడ్‌తోపాటు మరికొందరు అరెస్టు అయినవారిలో ఉన్నారు.

## మృతుని కుటుంబసభ్యులను పరామర్శించిన జిఎంఆర్ ఫౌండేషన్

**సిర్గాపూర్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మండల పరిధిలోని పోట్‌పల్లి గ్రామానికి చెందిన జూటోత్ కిషన్‌నాయక్ కుటుంబ సభ్యులను జిఎంఆర్ ఫౌండేషన్ బాధ్యులు మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ ఫౌండేషన్ సభ్యులు అనుముల తుకారాం, ఉమాసింగ్, గోరక్ నరేష్, గ్రామస్థులు హరీష్‌సింగ్, మారుతినాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో భారీ వర్షం-పొర్లుతున్న వాగులు

## -జలమయమైన వసంత్ విహార్ కాలనీ



జహీరాబాద్ అల్గోల్ బైపాస్ రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



వసంత్‌విహార్ కాలనీలోకి చేరిన వరదనీరు

**జహీరాబాద్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
జహీరాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుఝామున కురిసిన భారీవర్షానికి నియోజకవర్గంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జహీరాబాద్ నుంచి అల్గోల్ బైపాస్ మీదుగా భరత్‌నగర్ వైపు వెళ్లే రోడుపై పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నాలాలను, వాగులను కబ్జాచేసి వెంచర్లు వేయడంతో ఇలాంటి దుస్థితి ఏర్పడిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోలేదని వాపోయారు.

**వసంత్ విహార్‌లోకి వరద నీరు...**
పట్టణంలోని వసంత్‌విహార్ కాలనీ, ఇంద్రప్రస్థ కాలనీలోకి వరదనీరు చేరుకోవడంతో కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరదనీరు చేరుకుంటుండటంతో కాలనీవాసులు పడుతున్నపాట్లు చెప్పనలవిగా కాకుండా ఉన్నాయి. వర్షం కురిస్తే కాలనీ జలమయమవుతున్నా సంబంధిత అధికారులు తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతోనే ప్రతిసారి పరేషాన్‌కాక తప్పడం లేదని కాలనీవాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలోకి వస్తున్న నీటిని పెద్ద వంతెనలోకి మరల్చితే కొంతవరకు సమస్య తీరే అవకాశాలు ఉన్నాయిని కాలనీవాసులు గుర్తు చేస్తున్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పుల్‌కల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వెంకట కృష్ణాపూర్‌లో మంగళవారం డిసిసి బ్యాంక్ పుల్‌కల్ బ్రాంచి ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్రాంచిమేనేజర్ రాజనర్సింలు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.15 కోట్ల వరకు బ్యాంక్ వ్యాపారం పెరిగిందని, ఫలితంగా బ్యాంక్ టర్నోవర్ రూ.60కోట్లుగా ఉందని, ఈ సంవత్సరానికి గాను శివంపేట, పుల్‌కల్ సొసైటీలల దీర్ఘకాలిక వసూళ్లలో 75శాతం రుణ అర్హత సాధించాయన్నారు. అర్హత సాధించిన సొసైటీలకు రూ.5కోట్ల రుణబడ్జెట్ కేటాయించడం జరిగిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణ బాకాయిలు చెల్లించని మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తమ బ్యాంక్ పరిధిలో రూ.22కోట్ల పంటరుణాలు రైతులకు అందచేయగా డ్వాక్రామహిళలకు రూ.4.25కోట్ల రుణాలను అందచేశామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.13కోట్లను లబ్ధిదారులకు అందించినట్లు గుర్తుచేశారు. బ్యాంకులో లాకర్ల సదుపాయం అందుబాటులో ఉందని, ఖాతాదారులు ఈసౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంక్ ఖాతాదారులకు ఫోన్‌పే, గూగుల్‌పే యుపిఐ సౌకర్యాన్ని సైతం బ్యాంకు ఏర్పాటు చేసిందన్నారు. ఇతర బ్యాంకుల కన్నా తమబ్యాంక్‌లో డిపాజిట్‌చేస్తే రూ.0.65 అధికవడ్డీని అందించనున్నామన్నారు. వేయిరూపాయలు చెల్లించి బ్యాంక్‌లో ఖాతాలను తెరుచుకోవచ్చన్నారు. 12శాతం వడ్డీతో గ్రామీణ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకునేందుకు గృహరుణాలను అందిస్తున్నట్లు, ఇంతవరకు రూ.4కోట్ల రూపాయలను గృహ నిర్మాణాల కొరకు రుణాలను అందచేశామన్నారు. రైతులు తమ రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. పిఎంజెజెబివైపిఎంఎస్‌బివై ఇన్సూరెన్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్, స్టాఫ్ అసిస్టెంట్ మురళీకృష్ణ, సిబ్బంది అనిల్, బ్యాంక్ ఖాతాదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతంచేయాలి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

**సదాశివపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ అన్నారు. ఈనెల 20నుండి 22వరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం మహారాజాగార్డెన్స్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. మంగళవారం సదాశివపేటలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్‌లను సిపిఐ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడుతూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగోమహాసభలు ఈనెల 20వ తేదీనుండి 22వరకు హైదరాబాద్ గాజులరామారం మహారాజాగార్డెన్‌లో జరగనున్నాయన్నారు. ఈసమావేశానికి సదాశివపేట,కొండాపూర్,మునిపల్లి మండలాల నుంచి సిపిఐ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐనాయకులు లక్ష్మి, శివలీల, బుజ్జమ్మ పాల్గొన్నారు.

## మాజీమంత్రికి రాఖీకట్టిన కార్పొరేటర్



మాజీ మంత్రికి రాఖీ కడుతున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుకు భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధూ ఆదర్శ్‌రెడ్డి మంగళవారం రాఖీ కట్టి నోటిని మిఠాయిలతో తీపిచేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో బిఆర్ఎస్ బలోపేతంపై బిఆర్ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డితో మాజీ మంత్రి చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డికి మాజీ మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## మున్యానాయక్ రోడ్డును పరిశీలించిన అధికారులు



మున్యానాయక్‌తండా రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మున్యానాయక్‌తండా రోడ్డును పంచాయతీరాజ్ అధికారులు మంగళవారం పరిశీలించారు. తండాకు అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటంతో తండాకు చెందిన గర్భిణీ స్త్రీ కౌసల్యాబాయి (26)ను ఆసుపత్రికి తరలించేందుకు గర్భిణీ స్త్రీ భర్త ఇటీవల రెండు కిలోమీటర్ల దూరం వరకు భార్యను ఎత్తుకుని వెళ్లిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఈ.అంజయ్య, ఎఈ మధుసూదన్‌రెడ్డి, ఎంపిడిఓ మహేశ్వర్‌రావులు రోడ్డును పరశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తండాకు పక్షంరోజుల్లో రోడ్డును నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు భరోసా కల్పించారు. బాలింత కౌసల్యాబాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ప్రభుత్వ కళాశాలలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం



గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరిస్తున్న కళాశాల వైస్‌ప్రిన్సిపాల్

**జోగిపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సంధ్య, లెక్చరర్లు ఎ.శైలజ, బి.రాజేశ్వరి, అకాడమీ కోఆర్డినేటర్ శ్రీకాంత్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంగ్టి బస్టాండ్ ఖాళీ.. ప్రైవేట్ సముదాయంలో జనాల సందడి



ఖాళీగా ఉన్న కంగ్టి బస్టాండ్ దృశ్యం



బస్సు కోసం ప్రైవేటు సముదాయంలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

**కంగ్టి, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన కంగ్టి బస్‌స్టాప్ ఏళ్ల తరబడి ఉన్నవాటికీ పరిరక్షణ కరువైందని ప్రయాణికులు ఇబ్బందికి గురౌతున్నారు. పేరు మాత్రమే బస్టాండ్ కానీ అక్కడ ఎలాంటి ప్రయాణికులకు సదుపాయం లేదని, కనీసం పబ్లిక్ టాయిలెట్స్ కూడా లేవని ప్రయాణికులు వాపోతున్నారు. కంగ్టి బస్టాప్ అనేది అంతర్భాగంలో ఉండడంతో, చుట్టూ 30 కిలో మీటర్ల వరకు బస్టాపులు లేవని, ప్రయాణం చేసిన ప్రయాణికులు కొంతసేపు విశ్రాంతి తీర్చుకుందాం అనుకున్నా ఎలాంటి సదుపాయం లేక ఇబ్బందికి గురవుతున్నారు. కంగ్టి బస్టాపు మధ్యస్తంగా, అనగా కామారెడ్డి సరిహద్దు జిల్లాలు, అలాగే పక్కన ఉన్న కర్ణాటక రాష్ట్రం బోర్డర్ ఉండడంతో రోజుకు 2000మంది ప్రయాణికులు ఈ బస్టాండ్ నుండి ప్రయాణం చేస్తుంటారని స్థానికులు తెలిపారు. ఇలాంటి బస్టాండ్‌ను అభివృద్ధి చేయకపోవడం హాస్యాస్పదంగా ఉందని, స్థానికులు పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి ఆర్‌టిసి లాభాన్ని ఆశిస్తుంది కానీ ప్రజల అవసరానికి ఉపయోగపడే శౌచాలయాలు ఏర్పాటు చేయడంలేదని తెలిపారు. వివరాలకు డిపోమేనేజర్‌ను చరవాణి ద్వారా సంప్రతించగా ఎటువంటి స్పందన కూడా రాలేదని వివరించారు.

## సిఎంఆర్ఎఫ్, నూతన రేషన్‌కార్డుల అందజేత

**కొల్చారం, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
కొల్చారం మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామంలో మంగళవారం సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు, నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు తుక్కాపూర్ ఆంజనేయులు, ఆర్య రవీందర్ చేతులమీదుగా తుక్కాపూర్ గ్రామంలో అందించడం జరిగింది. సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు బ్యాగరి మంజుల కుమారుని హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.60000 చెక్కును నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో అందించడం జరిగింది. ఈకార్యక్రమంలో దొడ్ల ఆంజనేయులు, ఆరే రవీందర్, బంధముల మల్లయ్య, సిద్ధప్ప, దత్తురావు, పాండరీ, మధు, శ్రీశైలం, భాగయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

## తారాకళాశాల అంతర్జాతీయ యువజన దినోత్సవం




తారాకళాశాలలో అంతర్జాతీయ యువజన దినోత్సవం దృశ్యం

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాలు, రోటరీ క్లబ్ మంజీరా, సంగారెడ్డిల ఆధ్వర్యంలో మంగళవరం అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి డిఎస్‌పి సత్తయ్య హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలబారిన పడకుండా ఉండాలన్నారు. మత్తుపదార్థాలను వినియోగిస్తే మెదడుపై, నరాలపై ప్రభావం పడుతుందని అనారోగ్యాలకు గురై మంచానికి బానిస కావాల్సి వస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ జోష్ణ, డాక్టర్ సుమతిదేవి, డాక్టర్ వాణి, అధ్యాపకులు దేవేందర్, అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

**-మున్సిపల్ కమిషనర్‌కు వినతి**



మున్సిపల్‌కమిషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న సిపిఎంకార్యదర్శి విద్యాసాగర్

**జోగిపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన పారిశుధ్యనిర్వహణచర్యలు చేపట్టాలని సిపిఎం అందోలు డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ కోరారు. మంగళవారం ఈ విషయమై కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీపరిధిలో అపరిశుభ్రత మరీ ఎక్కువగా ఉండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధిబారిన పడుతున్నారని, అందుకే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో పరిశుభ్రత నెలకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా కూడా పిచ్చిమొక్కలు లేకుండా తొలగించాలని, అన్ని వార్డులలో దోమల మందు పిచికారి చేయాలని డిమాండ్ చేశారు. గత కొన్నిరోజులుగా వర్షాలు విపరీతంగా కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలే అవకాశం మరీ ఎక్కువగా ఉంటుందని, అందుకని పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాని కోరారు.

## వరిపంటలో కలుపు నివారణకు యంత్రం



కలుపునివారణకై యంత్రంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**పుల్‌కల్, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
వరిపంటలో కలుపునివారణకు యాంత్రీకరణ పద్ధతిలో ఒక యంత్రాన్ని మంగళవారం అధికారులు రైతులకు పరిచయం చేశారు. వరిపంట సాగుకు యాంత్రీకరణపద్ధతిలో ట్రాన్స్‌ప్లాంటర్‌తో లేదా కూలీల సహాయంతో చేతితోవేసిన వరిమడిలో సులువుగా కొత్తయంత్రాన్ని వినియోగించవచ్చని అధికారులు వివరించారు. యంత్రవినియోగంతో భూమిలో ఉన్న కలుపుమొక్కలు పెకలించబడి ప్రధానపంటకు నీరు, గాలి సమానంగా అంది పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. యంత్రం 50 సిసి ఇంజన్ కలిగి ఉంటుందని, 2 జిపి ట్రాక్టర్ సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. వరినాటిన 15 నుంచి 20 రోజులలో, 30 నుంచి 45 రోజులలో 2 దఫాలుగా వాడి వరిపంటలో యాంత్రికంగా సమగ్ర కలుపు యాజమాన్యం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.నాగిరెడ్డి, న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్ గ్రామంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ యం.విజయ్‌కుమార్, తెలంగాణ రైతు విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు కె.రాహుల్‌విశ్వకర్మ, డాక్టర్ అరుణ, జోగిపేట డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రామదేవి, మండలవ్యవసాయాధికారి శ్రీహరి,చైతన్య,ప్రవీణ,శ్రీనివాసరావు, ఆయా మండలాలకు చెందిన 50మందికిపైగా రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు అందజేత



ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు అందజేస్తున్న ఎంపిడిఓ

**మునిపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్దిదారులకు బిల్లులు మంగళవారం ఎంపిడిఓ డాక్టర్ హరినందన్‌రావు అందజేశారు. మండలంలోని అల్లాపూర్‌లో నిర్మాణములో వున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బేస్మెంట్ వరకు నిర్మాణాలు పూర్తిచేసుకున్న పావని, శ్రీలతలకు మంజూరు అయిన ఒక లక్ష రూపాయల చొప్పున వారి బ్యాంకులో జమచేసిన స్టేట్‌మెంటును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు సకాలంలో ఇళ్లు నిర్మించుకుంటే వెంటనే బిల్లులు మంజూరు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకరయ్య, మాణిక్యం, ఎంపిఓ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.